ప్రజాశక్తి
ఆదివారం 15 సెప్టెంబర్ 2024
5
అనంతపురం



19న ఐఎబి సమావేశం

హెచ్ఎల్సీ ఎస్ఈ రాజశేఖర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఐఎబి ఛైర్‌పర్సన్, కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఆదేశాల మేరకు ఈనెల 19వ తేదీన ఐఎబి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఐఎబి కన్వీనర్, హెచ్ఎల్సీ రాజశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఈనెల 19వ తేదీన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ సమావేశంలో పాల్గొనాలని కోరారు. ఈ నెల 12వ తేదీ జరగాల్సిన ఈ సమావేశం అనివార్య కారాణాల వల్ల వాయిదా పడింది. దీంతో సమావేశాన్ని 19వ తేదీ నిర్వహించేలా అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఐఎబి సమవేశం జరిగి తే నీటి కేటాయింపులు జరుగుతాయనే ఆశతో ప్రజలు ఉన్నారు.

సైన్స్ సంబరం

సైన్స్ గొప్పతనాన్ని తెలియజేశారు...
మూఢనమ్మకాల వల్ల కలిగే ప్రమాదాన్ని వివరించారు...
సమాజంలో ఉన్నదంతా సైన్స్ అని చాటిచెప్పారు....
అశాస్త్రీయ విధానాలను ప్రజలపై రుద్దే పాలకుల విధానాలను ఎండగట్టారు...
మానవాభివృద్ధికి మూలం సైన్స్ అనే విషయాన్ని ఎలుగెత్తి చాటారు...
అవాస్తవిక విధానాలకు అంతం పలికి, చైతన్యం వైపు ప్రజలు నడిచేలా జాగృతం చేశారు...

అనంతపురం నగరంలోని జిఆర్.ఫంక్షన్ హాలులో శనివారం ప్రారంభం అయిన జెవివి 17వ వార్షిక మహాసభల్లో వక్తల ప్రసంగాలు ఆద్యంతం ప్రజలను ఆలోచింపజేశాయి. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు ప్రసంగించారు. సైన్స్ గొప్పతనాన్ని తెలియజేస్తూ వారు చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. మూఢనమ్మకాలను పారదోలేలా ప్రజలను చైతన్య వంతం చేసేలా ప్రసంగించారు. వాస్తవికతను తెలియజేస్తూ, మూఢనమ్మకాలను వ్యతిరేకిస్తూ పాలకుల అశాస్త్రీయ విధానాలను ఎండగడుతూ చైతన్యవంతమైన ప్రసంగాలు సాగాయి.



జెవివి వార్షిక మహాసభల సందర్భంగా ప్రసంగిస్తున్న ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్


నాలుకపై దీపాన్ని వెలిగించి మ్యాజిక్ షోతో సైన్స్‌పై అవగాహన కల్పిస్తున్న యువకుడు



పిల్లా కుమారస్వామి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జెవివి, ఇతర సంఘాల నాయకులు

- ◆ సైన్స్‌తోనే మానవ మనుగడ
- ◆ సమాజంలో ఉన్నదంతా సైన్సే..!
- ◆ మూఢవిశ్వాసాలతో నష్టం
- ◆ అశాస్త్రీయ విధానాలను జనంపై రుద్దేలా పాలకుల విధానాలు
- ◆ సైన్స్ గొప్పతనం.. మూఢనమ్మకాల ప్రమాదాన్ని వివరించేలా ప్రసంగాలు
- ◆ సంబరంగా 'అనంత'లో ప్రారంభమైన జెవివి వార్షిక మహాసభ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించేందుకు కృషి చేసే జన విజ్ఞాన వేదిక వార్షిక రాష్ట్ర మహాసభ సంబరంగా ప్రారంభమైంది. రాష్ట్రం నలుమూలల నుంచి జన విజ్ఞాన వేదిక నాయకులు, కార్యకర్తలు అనంతపురం తరలొచ్చారు. నగరంలోని జిఆర్ ఫంక్షన్ హాలులో శనివారం ఉదయం సభలు ప్రారంభమయ్యాయి. సమతా కన్వీనర్ డాక్టర్ ప్రసూన జాతీయ పతాకావిష్కరణ చేయగా, జనన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ రంగన్న జన విజ్ఞాన వేదిక పతాకాన్ని ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదికలో పనిచేస్తూ మరణించిన సీనియర్ నాయకులకు నివాళులు అర్పించారు. అనంతరం జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన మహాసభ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్‌వర్క్ (ఎఐపిఎస్ఎన్) మాజీ అధ్యక్షులు ప్రొఫెసర్ సవ్యసాచి చటర్జీ పాల్గొని ప్రారంభోపన్యాసం చేశారు. అంతకు మునుపు మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మహాసభను ఉద్దేశించి సందేశమిచ్చారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, ఉపాధ్యక్షులు భాస్కర్, జన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ హేమలత, సమతా కన్వీనర్ డాక్టర్ ప్రసూన, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, సత్యసాయి జిల్లా కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, మెడికల్ రెప్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు మనోహర్, కవి, రచయిత కంబదూరు షేక్ నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

అశాస్త్రీయ ఆలోచనలతో పాలన

ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి



దేశంలో ఇప్పుడు అశాస్త్రీయ ఆలోచనలున్న వారు అధికార పీఠమెక్కి పాలన సాగిస్తున్నారని కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత ఆచార్య రాజపాలెం చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. శాస్త్రీయ ఆలోచనల వ్యాప్తిలో ఇప్పుడున్న అవరోధాల కంటే రాబోయే రోజుల్లో మరింత ఎక్కువగా ఉంటాయన్న విషయాన్ని సైన్స్ ప్రచారకులు గుర్తు పెట్టుకోవాలని సూచించారు. అందరిలోకి శాస్త్రీయ ఆలోచనలను తీసుకెళ్లేందుకు మరింతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మూఢనమ్మకాల నిరోధక చట్టం చేయాలి

మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



శాస్త్ర విజ్ఞానం పెరిగిన ఈ సమయంలోనూ అశాస్త్రీయ ఆలోచనలు కొనసాగుతూనే ఉండటం శోచనీయమని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తెలియజేశారు. విద్యావంతులు కూడా వీటిని ఆచరించే పరిస్థితులు ఉన్నాయన్నారు. దీన్ని రూపుమాపేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలు కూడా మూఢనమ్మకాల నిరోధక చట్టం చేయాలని కోరారు.

విద్య, వైద్యంలో ప్రచారం అవసరం

సామాజిక కార్యకర్త బోస్



విద్యా, వైద్యంలో శాస్త్రీయతను పెంపొందించేందుకు కృషి చేయాలని సామాజిక కార్యకర్త బోస్ పిలుపునిచ్చారు. నూతన విద్యా విధానం పేరుతో అశాస్త్రీయతను ప్రవేశపెడుతున్నారన్నారు. దీన్ని తిప్పికొట్టే ఆలోచనలు చేయాలన్నారు. వైద్యరంగంలోనూ కొన్ని మార్పులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంచాలి

సవ్యసాచి చటర్జీ




సైంటిఫిక్ టెంపర్ –ఛాలెంజెస్ 'అన్న అంశంపై ప్రొఫెసర్ సవ్యసాచి చటర్జీ ప్రారంభోపన్యాసం చేశారు. దేశంలో గూడుకట్టుకున్న అశాస్త్రీయ భావాలకు వ్యతిరేకంగా 1882 నుంచే రాజ రామ్మోహన్ రాయ్ వంటి వారు పనిచేసారని గుర్తు చేశారు. తరువాత స్వాతంత్రోద్యమ కాలంలోనూ శాస్త్రీయతపై మరింతగా దృష్టి సారించారన్నారు. ఈ స్పూర్తితోనే స్వాతంత్ర్యం అనంతరం కూడా శాస్త్రీయ దృక్పథం ప్రజల్లో పెంపొందించాలని రాజ్యాంగంలో పొందుపరుచుకున్నట్లు తెలిపారు. ఇటీవలి కాలంలో తిరోగామి శక్తులు ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపుదలకు వ్యతిరేకంగా పనిచేస్తుండడం విచారం కలిగించే అంశం అన్నారు. ఈ అవరోధాన్ని అధిగమించే దిశగా సైన్సు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాల్సి ఉంటుందని పిలుపునిచ్చారు.


జెవివి వార్షిక మహాసభలకు హాజరైన ప్రతినిధులు

సైన్స్, టెక్నాలజీ ఒక్కటి కాదు

మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్



ప్రస్తుత సమాజంలో సైన్స్, టెక్నాలజీ ఒక్కటే అన్న అపోహ ఉందని మానవహక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ తెలిపారు. సైన్స్ వేరు టెక్నాలజీ వేరని సూచించారు. సైన్స్ పెంపుదలపై ప్రస్తుతం తగినంత ప్రోత్సాహం ఉండటం లేదని చెప్పారు. దీన్ని పెంపొందించడంలో కీలకంగా వ్యవహరించే విశ్వవిద్యాలయాల్లోనే పరిశోధనలు జరగకపోవడం శోచనీయమన్నారు.

ఆటలతో మానసికోల్లాసం

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నిత్యం విద్యా బోధనలో నిమగ్నం అయిన ఉపాధ్యాయులకు ఆటలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. యుటిఎఫ్ అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఆటల పోటీలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాల బోధనతో నిత్యం గడుపుతుంటారన్నారు. ఇలాంటి సమయంలో వారికి కొంత మానసికోల్లాసాన్ని కలిగించేందుకు యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఆటల పోటీలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శనివారం నాడు పరుగు పందెం, షాట్ పుట్, జావలిన్ త్రో తదితర విభాగాల్లో పోటీలను నిర్వహించారు. 45 సంవత్సరాలు పైబడిన 100 మీటర్ల పరుగులో జగన్మోహన్ రెడ్డి, రమేష్, రామంజి, 200 మీటర్ల పరుగులో రామంజి, నారాయణ, నందకుమార్, 400 మీటర్లలో రామంజి, రామకృష్ణ, షాట్‌పుట్‌లో జగన్మోహన్ రెడ్డి, రమేష్, రామకృష్ణ, మహిళల 100 మీటర్ల పరుగులో ప్రమీల, దేవేంద్రమ్మ, లక్ష్మి, 400 మీటర్ల వాక్‌లో ప్రమీల, కవిత, దేవేంద్రమ్మ షాట్‌పుట్‌లో తాజుద్దీన్, లక్ష్మీ, దేవేంద్రమ్మ, జావలిన్‌త్రోలో దేవేంద్రమ్మ, తాజుద్దీన్, లక్ష్మి, పురుషుల 45 సంవత్సరాల లోపు 100 మీటర్ల పరుగులో ప్రవీణ్, జగదీష్, రమేష్, 200 మీటర్ల పరుగులో రమేష్, జగదీష్, షాట్ పుట్‌లో రమేష్, జగన్మోహన్, రెడ్డి, ప్రవీణ్ గెలుపొందారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, అధ్యక్షులు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, అధ్యక్షుడు రామప్ప, కోశాధికారి రాఘవేంద్ర, ప్రమీల, సంజీవ్ కుమార్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ మృతికి ఎస్పీ నివాళి

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో విధుల్లో ఉంటూ గుండెపోటుతో మృతిచెందిన ఏఆర్ కానిస్టేబుల్ చంద్రానాయక్‌కు ఎస్పీ పి.జగదీష్ నివాళులర్పించారు. శుక్రవారం స్థానిక వీరనారమ్మ ఆలయం సమీపంలో ఉన్న ఇంటి వద్దకు మృతదేహాన్ని తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్పీ జగదీష్ మృతుడి ఇంటి వద్దకు వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి భార్య అరుణ, కూతుళ్లు అంజలి, నందినిని ఎస్పీ పరామర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చంద్రానాయక్ కుటుంబానికి పోలీసు కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. కుటుంబానికి అందాల్సిన సాధారణ సౌకర్యాలతోపాటు సిఎం చంద్రబాబు ప్రత్యేకంగా రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత ప్రకటించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ బివి.శివారెడ్డి, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ మధు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, గాండ్ల హరినాథ్, ఏఆర్ ఎస్ఐలు, బ్యాచిమేట్లు, బంధువులు, తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎస్పీ పి.జగదీష్

ఆయకట్టుకు 130 రోజులు నీరివ్వాలి

హంద్రీనీవా నీరు 10 టీఎంసీలు కేటాయించాలి

ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలోని ఆయకట్టుకు 130 రోజులు సాగునీరు ఇచ్చి రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో గత రెండేళ్లుగా వర్షాలు రాక భూగర్భజలాలు అడుగంటిపోయాయన్నారు. ఈనేపథ్యంలో ఈసారి కర్ణాటకలో వర్షాలు రావడంతో తుంగభద్ర జలాశయంలోకి పూర్తిస్థాయిలో నీరు వచ్చిందన్నారు. అయితే ప్రభుత్వం, ఇరిగేషన్ అధికారులు మాత్రం ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీరు ఇవ్వడానికి సిద్ధమైనట్లు తెలుస్తోందన్నారు. తుంగభద్ర జలాశయం నుంచి దామాషా నిష్పత్తి ప్రకారం 26.368 టీఎంసీలు నీరు వస్తుందని అంచనా వేయడంతో ఈసారైనా పంటలు సాగు చేయవచ్చని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో అధికారులు ఆరుతడి పంటలు సాగు చేయాలని చేసిన ప్రకటన తీవ్ర గందరగోళానికి గురిచేసిందన్నారు. హంద్రీనీవా నుంచి తాగునీటి నిమిత్తం 10 టీఎంసీలు కేటాయించాలని, హెచ్ఎల్‌సితోపాటు మిడ్‌పెన్నార్ ఉత్తర, దక్షిణ కాలువల కింద ఆయకట్టుకు 130రోజులు పూర్తిస్థాయిలో నీరు ఇచ్చేవిధంగా ఐఎబి సమావేశంలో నిర్ణయించి రైతులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇకపోతే తుంగభద్ర డ్యామ్‌లో పూర్తిస్థాయిలో నీరు ఉన్నా ఎగువ కాలువ అధునీకరణ లేకపోవడంతో పూర్తిస్థాయిలో నీరు తీసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. దీనికితోడు కాలువకు గండ్లు పడి నీరు వృథా అయ్యే అవకాశం ఉందన్నారు. డ్యాంలో పుష్కలంగా నీరు ఉన్నా 1800 క్యూసెక్కులకు మించి నీరు తీసుకునే పరిస్థితులు లేకుండా పోయిందన్నారు. కావున కాలువ అధునీకరణ పనులకు నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని కోరారు.

గత ప్రభుత్వం హంద్రీనీవా ప్రధాన కాలువ 6000 క్యూసెక్కులకు పెంచుతామని ప్రకటించి టెండర్లు పిలిచినా పనులు మాత్రం ప్రారంభమవలేదన్నారు. 2019లో అప్పటి సిఎం చంద్రబాబు హంద్రీనీవా కాలువను 6,800 క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచుతామని ప్రకటించినా చేసేదేమీ లేదన్నారు. కనీసం ఇప్పుడైనా కాలువ సామర్థ్యాన్ని పెంచాలని డిమాండ్ చేశారు.


ఇకపోతే తుంగభద్ర 19వ గేటు కొట్టకపోవడంతో జలాశయం భద్రతపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నియమించిన నిపుణులు కమిటీ ప్రాథమిక అంచనా రిపోర్టు ఇచ్చిందన్నారు. తుంగభద్ర డ్యామ్ భద్రతపై కమిటీ ఇచ్చిన నివేదికను అమలుకు ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక ప్రభుత్వాలు చర్యలు తీసుకునే విధంగా జిల్లా ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకొచ్చి అనంతపురం, కర్నూలు కడప జిల్లాల్లో సాగు, తాగునీటికి ఇబ్బందులు రాకుండా 12న జరిగే ఐఎబి సమావేశంలో తీర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ భవనాల ధ్వంసం బాధాకరం

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

మండలంలోని చిన్న ముష్టూరు గ్రామంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రభుత్వ హెల్త్ సెంటర్‌ను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. రెండురోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తులు గ్రామంలోని హెల్త్ సెంటర్, రైతు భరోసా కేంద్రాల శిలాఫలకాలు, భవనాల తలుపులను ధ్వంసం చేశారు. అంతేకాకుండా కార్యాలయంలో ఉన్న ఫ్యాన్లు, విద్యుత్ సామగ్రిని దొంగలించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే శనివారం గ్రామానికి చేరుకుని ధ్వంసమైన కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వ కార్యాలయాల ధ్వంసాలకు పాల్పడుతున్నారన్నారు. వెంటనే ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామంలోని ప్రజలకు కనీస సౌకర్యాలు అందకుండా చేయాలన్న ఉద్దేశంతోనే ఇలాంటి ఘటనలకు పాల్పడ్డారన్నారు. కాగా వజ్రకరూరు మండలం కమలపాడులో మాజీ సర్పంచి యోగానందకు చెందిన మోటర్ బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు తగులబెట్టడంతోపాటు ఉరవకొండ మండలం మోపిడి గ్రామ సర్పంచుకు చెందిన విలువైన చెట్లను నరికివేశారన్నారు. అయినా పోలీసులు చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే ఆయా ఘటనలకు కారణమైన బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపిపి నర్సింహులు, మాజీ ఎంపిపి ఎర్రిస్వామి, సీనియర్ నాయకులు సుంకన్న, బాబు, తదితరులు పాల్గొన్నారు.


ధ్వంసం చేసిన భవనాలను పరిశీలిస్తున్న వై.విశ్వేశ్వరరెడ్డి

కార్మికులపై బెదిరింపులు సరికాదు

సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం


భిక్షాటన చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

శ్రీరామిరెడ్డి, శ్రీసత్య సాయి తాగునీటి పథకాల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తుంటే పరిష్కరించకుండా బెదిరింపులకు పాల్పడటం సరికాదని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున అన్నారు. కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా శనివారం రాయదుర్గంలో భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించేంత వరకూ చేపట్టిన సమ్మెను విరమింపజేసే ప్రసక్తేలేదన్నారు. చర్చల పేరుతో కాలయాపన చేస్తూ శ్రీరామిరెడ్డి కార్మికులతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున మాట్లాడుతూ కార్మికులు తక్షణమే విధుల్లోకి రాకపోతేకొత్తవారిని తీసుకుంటామంటూ బెదిరింపులకు పాల్పడటం మంచిది కాదన్నారు. 8 నెలల నుంచి వేతనాలు అందకపోతే కార్మికులు ఎలా తిని బతకాలని నిలదీశారు. చేసేది లేక భిక్షాటన చేస్తున్నట్లు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెను కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామిరెడ్డి కార్మికులు పాల్గొన్నారు.


హిందీ దివస్ వేడుకలు

అనంతపురం : నగరంలోని ఎస్వి డిగ్రీ కళాశాలలో హిందీ విభాగం హిందీ దివస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ హిందీ దేశ రాజభాష అన్నారు. ఈ భాష నేర్చుకోవడం ప్రతిఒక్కరికీ అత్యంత అవసరమన్నారు. అనంతరం విద్యార్థులు దేశభక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ సి.సోమశేఖర్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎవి.ప్రసాద్, కళాశాల ఎఒ శ్రీనాథ్, తెలుగు విభాగం అధ్యక్షులు ఇ.మురళీధర్, సంస్కృతం విభాగ అధ్యక్షులు ఎ.ఆదెప్ప, విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వందశాతం ఇకెవైసి పూర్తి చేయాలి

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్


రైతులతో మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

ఈ-పంట నమోదుతోపాటు వందశాతం ఇకెవైసి పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం రాయదుర్గం మండల పరిధిలోని ఆవులదట్ల, రాయదుర్గం రైతు సేవాకేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా రైతు సేవాకేంద్రాల్లో చేస్తున్న ఇకెవైసిని పర్యవేక్షించారు. జిల్లాలో 8,58,634 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేశారన్నారు. అయితే ఇప్పటి వరకూ కేవలం 42 శాతం మాత్రమే ఇకెవైసి పూర్తి చేవారన్నారు. రెండు రోజుల్లోపు ఈపంట నమోదు, ఇకెవైసి వందశాతం పూర్తి చేయాలన్నారు. ఒక్క రాయదుర్గం నియోజకవర్గంలోనే 1,58,521 ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు చేయగా వందశాతం ఈపంట నమోదు చేశారన్నారు. రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 42శాతం మాత్రమే చేశారన్నారు. కావున వెంటనే వందశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మానాయక్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి


ఆర్ట్స్ కళాశాల వద్ద ఏచూరికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతికి కార్మిక సంఘాలు, కార్మికులు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల ఎదుట భగత్ సింగ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచి అంతిమ శ్వాస వరకూ పేదల కోసమే తపించారన్నారు. అలాంటి ఆయన మృతి కార్మికులు, కష్టజీవులు, అణగారిన వర్గాలకు తీరని లోటు అన్నారు. కాగా మల్లు స్వరాజ్యం నగర్, శ్రీశ్రీ నగర్, మున్సిపాలిటీ కార్మిక సంఘం, ఆటో కార్మిక సంఘం, రంగస్వామినగర్, 6వ రోడ్డు, గణేనాయక్ కాలనీ, మహదేవ్ నగర్, ఎన్టీఆర్ సర్కిల్, తదితర ప్రాంతాల్లో ఏచూరికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు వెంకట నారాయణ, మసూద్, డేవిడ్, లాలు, రాము, వన్నూరు, 6వ రోడ్డు శాఖ కార్యదర్శి ఉమేష్, అమీర్, లింగమయ్య, నారాయణస్వామి, బషీర్, నూర్, ఆటో యూనియన్ నాయకులు భాస్కర్, నాగరాజు, రామాంజి, సోమప్ప, రైల్వే వర్కర్స్ యూనియన్ నాయకులు మంత్రి రామాంజనేయులు, ప్రకాష్, వలి, రాజు, వెంకటేష్, గఫూర్, టిఎన్.రసూల్, తదితరులు పాల్గొన్నారు.

అలాగే సిపిఎం మహదేవ్ నగర్ శాఖ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. ఇందులో భాగంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మసూద్, నాయకులు డేవిడ్, మసూద్, వార్డ్ సభ్యులు రమాదేవి, రసూల్‌బీ, మహేశ్వరి, లక్ష్మీదేవమ్మ, కాలనీ నాయకులు రాము, శీన, వెంకట్ నారాయణ, లాలు, మంజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని భగత్‌సింగ్ కాలనీలోని సిపిఎం కార్యాలయంలో కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పేదలు, కష్టజీవుల పక్షాన చివరి శ్వాస వరకూ పోరాడిన ఆదర్శ కమ్యూనిస్టు సీతారాం ఏచూరి అన్నారు. ఆయన మరణం సిపిఎంతోపాటు దేశానికి లోటు అన్నారు. ఇలాంటి గొప్ప నాయకుడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్ పి ఆర్ డి జిల్లా కార్యదర్శి ఐద్వా మహిళా సంఘం వెంకటమ్మ గంగమ్మ గోవిందు విశ్వేస రామలక్ష్మి రాజీ అక్కులన్న నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూరులో నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

బుక్కరాయసముద్రం : మండల రైతుసంఘం ఆధ్వర్యంలో సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి శనివారం నివాళులర్పించారు. ఇందులో భాగంగా చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఏపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శివారెడ్డి, మండల సెక్రటరీ డి.శ్రీనివాసులు, నాయకులు నారాయణస్వామి, శ్రీరాములు, రామకృష్ణ, లక్ష్మీనారాయణరెడ్డి, సిఐటియు నాయకులు నాగేంద్ర, సీనా, ముట్టి వెంకటేష్, విజయ్, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.


బుక్కరాయసముద్రంలో నివాళులర్పిస్తున్న సిపిఎం, రైతుసంఘం నాయకులు

నేడు ప్రయివేట్ పాఠశాలల సర్వసభ్య సమావేశం

అనంతపురం : నగరంలోని మాంటిసోరి లైట్ పాఠశాలలో ఆదివారం ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యం సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు అపుస్మా జిల్లా అధ్యక్షులు కుసుమ పుల్లారెడ్డి, కార్యదర్శి గాజుల చంద్ర తెలిపారు. శనివారం నగరంలోని కమలానగర్‌లోని అపుస్మా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం జరగనున్న సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ప్రయివేట్ పాఠశాలల ముఖ్య సలహాదారులు శేఖర్‌రావు, పరంజ్యోతి హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అపుస్మా గౌరవాధ్యక్షులు నాయుడు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, రాష్ట్ర కన్వీనర్ నాగరాజు, శశిభూషణ్, సూర్యనారాయణరెడ్డి, రవిశంకర్, ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణ

కళ్యాణదుర్గం : వరద బాధితుల సహాయార్థం ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల సమితి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో విరాళాలు సేకరించారు. ఇందులో భాగంగా ఎస్సార్ క్లినిక్ డాక్టర్ శ్రీనివాస్ నాయక్, రమేష్ రూ.2వేలు, వెల్ఫేర్ డీడీ సత్యనారాయణ రూ.10వేలు, ఎంఇఒ రూ.5వేలు, డాక్టర్ వెంకటరమణ రూ.2వేలు సాయం అందించారు. ఈ కార్యక్రమంలో అవార్డు గ్రహీత కిషోర్, సమన్వయ సమితి కన్వీనర్ గోనెపాటి అశోక్‌కుమార్, శ్రీధర్, ఓబుళపతి, తిప్పేస్వామి, నరసింహులు, నాగరాజు, గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు సేకరణ


నిత్యావసరాలను సేకరిస్తున్న టిడిపి నాయకులు

పామిడి : వరద బాధితుల సహాయార్థం టిడిపి నేత ఆర్ఆర్.రమేష్, మండల సీనియర్ నాయకుల సహకారంతో పామిడి, గుత్తి మండలాల్లో దుస్తులు, నిత్యావసర సరుకులను సేకరించారు. ఇందులో భాగంగా సేకరించిన 600 క్వింటాళ్ల బియ్యం, 500 కుటుంబాలకు సరిపడ దుస్తులను మూడు లారీల్లో విజయవాడకు తరలించారు. ఈ కార్యక్రమంలో పామిడి పట్టణ అధ్యక్షుడు బొమ్మ మోహన్, ప్రధాన కార్యదర్శి పసుల శ్రీరాములు, వాల్మీకి సాధికార కార్యదర్శి సుంకప్ప, నాయీబ్రాహ్మణ సాధికార జిల్లా కార్యదర్శి వెంకటరమణ, సీనియర్ నాయకులు డీలర్లు తపాల్, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు

వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

యల్లనూరు : మండల కేంద్రంలోని సిఐ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా ద్విచక్ర వాహనదారుల నుంచి హెల్మెట్, డ్రైవింగ్, లైసెన్స్, ఆర్‌సి తదితర రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రికార్డులు లేని వారికి అపరాధ రుసం విధించారు. రోడ్డు నియమాలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సిఐ హెచ్చరించారు..

జాతీయ నులిపురుగుల నివారణ పోస్టర్లు విడుదల

ఉరవకొండ : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి.షఫీ మాట్లాడుతూ ఈనెల 17న అన్ని పాఠశాలలు, అంగన్వాడీలు, కళాశాలలో 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు నులిపురుగుల నివారణకు మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, ఫార్మాసిస్ట్ మంగమ్మ, స్టాఫ్‌నర్స్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు 'అమ్మ' చేయూత

అనంతపురం : అనంతపురంలోని బళ్లారి రోడ్డులో నివాసం ఉంటున్న మహాదేవనాయుడు కుమారులు దినేష్‌చౌదరి, శ్యామ్‌సుందర్‌చౌదరికి అమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం ఆర్థిక చేయూత అందించారు. వివరాల్లోకి వెళ్తే.. విద్యార్థులు ఇద్దరూ కర్నూలు జిల్లా పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మొదట సంవత్సరం చదువుతున్నారు. అయితే వీరికి ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో మొదటి సంవత్సరం సెమిస్టర్ ఫీజు, మెస్(హాస్టల్) ఫీజు కలిపి రూ.2 లక్షలు, నగదు రూపంలోనూ రూ.50వేలు, ఒక ల్యాప్‌టాప్, మెటీరియల్స్ అందజేశారు. ట్రస్టు అధ్యక్షులు తరిమెల రమణారెడ్డి నేరుగా విద్యార్థుల వద్దకు చేరుకుని అందజేశారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

అనంతపురం కలెక్టరేట్ : నగరంలోని హెచ్చెల్సీ దగ్గర ఉన్న కభరస్థాన్‌లో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఆవాజ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు వలి, మసూద్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నగరంలో ప్రధానంగా రెండు కభరస్తాన్‌లు ఉన్నాయన్నారు. వీటిలో ఒకటి సాయినగర్, 2వది హెచ్చెల్సీ దగ్గర ఉన్నాయన్నారు. కెనాల్ వద్ద ఉన్న కభరస్తాన్‌లో రాత్రి వేళల్లో ఖననం చేయాలంటే ఇబ్బందుల పాలవుతున్నారన్నారు. ఈ విషయాన్ని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని కభరస్తాన్‌లో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

'అనంత'ను కలిసిన నాయకులు

అనంతపురం : వైసిపి జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన అనంత వెంకటరామిరెడ్డిని మాదిగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పసలూరి ఓబిలేసు శనివారం అనంతపురంలోని స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌పిఎస్ నాయకులు లబ్బె ముత్యాలప్ప, వెంగళ ఆదినారాయణ, జిసి వెంకటేశులు, మనోహర్, ఎర్రిస్వామి, మల్లికార్జున, వైసిపి నాయకులు రాజారత్నం, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడి మృతికి నివాళి

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని గోవిందయ్యదొడ్డి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు తిమ్మప్ప (65) మృతికి పలువురు నివాళులర్పించారు. ఇందులో భాగంగా టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, తదితరులు తిమ్మప్ప మృతదేహానికి పూలమాలలు వేసి అంజళి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజు, సర్పంచి సందీప్, మాజీ సర్పంచి హనుమంతప్ప, రుద్రప్ప, బీరేష్, పెన్నప్ప, రమేష్, ధనుంజయ్య, నాగరాజు, పోలేపల్లి వన్నూరుస్వామి, సత్యప్ప, మురళీ, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారం


రాయదుర్గంలో సమస్యలను వింటున్న జడ్జిలు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం లోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 213 కేసులను పరిష్కరించినట్లు జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ ఎం.రమ్య తెలిపారు. ఇందులో 16 ఐపిసి, 4 ఎంసీ, 12 ఎక్సైజ్, ఐదు బ్యాంకు కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. రూ.23,65,565 విలువజేసే కేసులు పరిష్కారం కాగా రూ.4,800 జరిమానా విధించినట్లు తెలిపారు. సెకండ్ క్లాస్ కోర్టు పరిధిలో 172 పెట్టీ కేసులు పరిష్కరించగా రూ.60,600 జరిమానా విధించినట్లు తెలిపారు.

గుత్తి : గుత్తి న్యాయస్థానాల ప్రాంగణంలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో పలు కేసులు పరిష్కారమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి శ్రీహరి, సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ ఆచారి కలిసి 132 కేసులను పరిష్కరించారు. వాటికి సంబంధించి రూ.3.50 కోట్లు ఇచ్చేలా పరిష్కారం చేశారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ కమిటీ సభ్యులు మహమ్మద్ రసూల్, ఎన్.ఓబిలేసు, విసి.గంగాధర్ కుమార్, రోజారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రామశర్మ, మాజీ అధ్యక్షులు మనోహర్ బాబు, పీడీ రత్నం, మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న టిడిపి నాయకులు


ఆత్మకూరు : మండల కేంద్రంలో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా టిడిపి మండల కన్వీనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే పరిటాల సునీతమ్మ ఆదేశాల మేరకు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్లు మనోరంజన్, నాయకులు పలమాసి సూర్యనారాయణ, పిల్లల ప్రతాప్, భూమే వెంకటనారాయణ, కందుల ఓబుళపతి, దుబ్బ రవీంద్రారెడ్డి, తెలుగు యువత నాయకులు అంకే ఆనంద్, పెద్ద లక్ష్మీదేవి, బొమ్మయ్య, తిక్కస్వామి, గుజ్జల రవి, పోతన్న, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి


పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీలు

పామిడి : గర్భిణులు తీసుకునే ఆహారంలో ఐరన్, కాల్షియం ఉండేటట్లు చూసుకోవాలని అంగన్వాడీలు సూచించారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని అంగన్వాడీ-4లో పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ భారతి, ఏఎన్ఎం వాణి, ఆశాలు నాగమణి, భారతి, రాజేశ్వరి, ఆయా భూలక్ష్మి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. అలీఆగే పోరూరు అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్త శివలక్ష్మి ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం నాగమునేశ్వరి, రమాదేవి, బాలింతలు, గర్భవతులు, మహిళలు పాల్గొన్నారు.

పామిడి ప్రభుత్వాసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స


బాలుడికి శస్త్ర చికిత్స చేస్తున్న వైద్యులు

పామిడి : పామిడి ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స చేశారు. వైద్యాధికారి శివకార్తీక్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన పదేళ్ల బాలుడు నందకిషోర్ ఐదేళ్లుగా నడుము కింది భాగంలో ఫారిన్ బాడీ సమస్యతో బాధపడుతున్నాడు. దీంతో తనను సంప్రదించగా శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ కమలాధర్, హెడ్‌నర్సు శివకుమారి, థియేటర్ అసిస్టెంట్ అంజినప్ప, కార్పొరేట్ ఆసుపత్రి స్థాయిలో సిఆర్ఎం ఎక్స్రే మిషన్ సాయంతో శస్త్ర చికిత్స చేసి ఫారిన్ బాడీని తొలగించినట్లు తెలిపిఆరు. దీంతో రోగి బంధుమిత్రులు వైద్య సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

సోలార్ ప్యానల్, పుస్తకమిత్ర వితరణ


సోలార్ ప్యానల్‌కు పూజలు చేస్తున్న ఎన్ఆర్ఐ వాసవీ గ్రూపు సభ్యులు

పుట్లూరు : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలకు ఎన్ఆర్ఐ ప్రవాస భారతీయ వాసవి సంఘం ఆధ్వర్యంలో రూ.1.50లక్షలు విలువజేసే సోలార్ ప్యానల్, పుస్తకమిత్ర వితరణ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ వాసవీ గ్రూపు రీజినల్ డైరెక్టర్ కృష్ణవేణి శ్రీరామ్, వెంకటకృష్ణ, శ్రీరామ్ మాట్లాడుతూ ఎన్ఆర్ఐ వాసవి అసోసియేషన్ ఆధ్వర్యంలో భారతదేశంలో ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పుస్తక పఠనాన్ని బాగా అలవర్చుకోవాలన్నారు. పుస్తకాలు మంచి నేస్తాలు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ మాధవి ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నారాయణ కళాశాల ఉద్యోగి మృతి


రాఘవేంద్ర (పాతచిత్రం

అనంతపురం : బుక్కరాయసముద్రం మండలం వడియంపేట వద్ద ఉన్న కేశవరెడ్డి పాఠశాల సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నారాయణ జూనియర్ కళాశాలకు చెందిన పూజారి రాఘవేంద్ర మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. తాడిపత్రి రాగి తోట పాలెంకు చెందిన పూజారి రాఘవేంద్ర నారాయణ జూనియర్ కళాశాలలో అకౌంట్ సెక్షన్‌లో పని చేస్తున్నాడు. ఇందులో భాగంగా వడియంపేట నారాయణ జూనియర్ కళాశాలకు వెళ్తుండగా వెనుకగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో రాఘవేంద్ర అక్కడికక్కడే మృతిచెందాడు. రాఘవేంద్ర భార్య శ్రీచైతన్య కోర్టు రోడ్డు బ్రాంచిలో ఉపాధ్యాయురాలుగా పని చేస్తోంది. మృతుడికి ఇద్దరు ఆడ పిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతిచెందడంతో కుటుంబం దిక్కుతోచని పరిస్థితిలో ఉంది.

'ఆలం' కష్టాన్ని అధిష్టానం గుర్తించేనా..

'నామినేటెడ్'పై నరసానాయుడు అభిమానుల ఆశలు



ప్రజాశక్తి-నార్పల

దశాబ్దాల కాలంగా శింగనమల నియోజకవర్గంలో టిడిపి అభివృద్ధికి 'ఆలం' కుటుంబం పెద్ద దిక్కుగా నిలుస్తూ వస్తోంది. ముఖ్యంగా నియోజకవర్గ టిడిపికి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు మూలస్తంభంగా నిలిచాడు. పార్టీ అధికారంలోకి ఉన్నా.. లేకపోయినా కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులకు అండగా ఉంటూ చేయూత అందిస్తున్నారు. మొన్న జరిగిన సాధారణ ఎన్నికల్లో సైతం పార్టీ విజయానికి ఎనలేని కృషి చేశారని చెప్పవచ్చు. తన సొంత నియోజకవర్గంతోపాటు అనంతపురం అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గాలు, అనంతపురం ఎంపీ అభ్యర్థులను గెలిపించడంలో కీలకంగా వ్యవహరించారు. ఆయా ఎమ్మెల్యే అభ్యర్థులు బండారు శ్రావణిశ్రీ, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు తోడుగా ముమ్మరంగా ప్రచారం చేశారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా, అధికార ప్రతినిధిగా జిల్లావ్యాప్తంగా ఉన్న పరిచయాలతో అభ్యర్థుల విజయంలో కీలకపాత్ర పోషించారు. ముఖ్యంగా నియోజకవర్గంలో బండారు శ్రావణిశ్రీ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించినప్పటికీ అధినేత చంద్రబాబు, జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు అధిష్టాన నిర్ణయమే శిరోధార్యంగా భావించారు. నియోజకవర్గ వ్యాప్తంగా గ్రామగ్రామానికీ వెళ్లి అప్పటికే గ్రూపులుగా విడిపోయిన నాయకులు, కార్యకర్తలను కలుపుకుని ఏకతాటిపైకి తీసుకురావడంలో పూర్తిస్థాయిలో విజయమంతం అయ్యారని చెప్పవచ్చు. అయితే ప్రస్తుతం టిడిపి అధికారంలోకి రావడంతో ఆలం నరసానాయుడుకు తప్పనిసరిగా నామినేటెడ్ పదవి వస్తుందని కార్యకర్తలు, ఆయన అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆయన చేసిన సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం రాష్ట్రస్థాయిలోనే సముచితమైన పదవి ఇచ్చి తగిన గౌరవం ఇస్తుందని అంటున్నారు. అయితే నామినేటెడ్ పదవి ఖాయం.. అయితే ఏ పదవి ఇస్తారో.. అని ఎదురు చూస్తున్నామని ఆయన అభిమానులు అంటున్నారు. ఏదిఏమైనా ఆలం నరసానాయుడును ఏ పదవి వరిస్తుందో వేచిచూడాల్సిందే...

స్వచ్ఛంద సంస్థలకు సేవా పురస్కారాలు


భారత సేవా పురస్కారాన్ని అందుకుంటున్న మంజునాథ్ (చేంజ్ ఫర్ సొసైటీ)

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం ప్రాంతానికి చెందిన మూడు స్వచ్ఛంద సంస్థలకు జాతీయ, ప్రాంతీయ సేవా పురస్కారాలు లభించాయి. బెంగళూరుకు చెందిన సోమలరాజు ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో రాయదుర్గం ప్రాంతానికి చెందిన చేంజ్ ఫర్ సొసైటీకి భారత సేవా పురస్కారం లభించింది. సంస్థ తరఫున మంజునాథ్ పురస్కారాన్ని అందుకున్నారు. అలాగే సంస్థ వ్యవస్థాపకులు జబీవుల్లా కర్ణాటక సేవా పురస్కారాన్ని, మహిళా సభ్యులు అనిత, భారతి, రోజా మదర్‌థెరిసా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్, కర్ణాటక , తెలంగాణ రాష్ట్రాలలో చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి సోమల రాజు ఫౌండేషన్ భారత సేవా పురస్కారం, కర్ణాటక సేవా పురస్కారం, మదర్‌థెరిసా పురస్కారాలను ఈ సంస్థకు ప్రకటించింది. అదేవిధంగా రాయదుర్గానికి చెందిన శ్రీరామ్ ఫౌండేషన్ అధ్యక్షులు కుమారి అనుషా కూడా భారత సేవా పురస్కారాన్ని అందుకుంది. గుమ్మఘట్ట మండలం పూలకుంట గ్రామానికి చెందిన యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దివాకర్ కూడా సేవా పురస్కారాన్ని అందుకున్నారు. రాయదుర్గం ప్రాంతానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థలు చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించి వారికి పురస్కారాలను అందించి ప్రోత్సహించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


'గుమ్మనూరు' సోదరులపై బురద చల్లడం తగదు


విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

నియోజకవర్గంలో అభివృద్ధికి బాటలు వేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు సోదరులపై బురద చల్లడం తగదని టిడిపి నాయకులు నాయకులు మండిపడ్డారు. శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఎంకె.చౌదరి, నాయకులు సంపత్ కుమార్, రియాజ్, న్యాయవాది సోము, జనసేన నాయకుడు పాటిల్ సురేష్, ఎమ్మార్పీఎస్ నాయకురాలు కె.సునీత మాట్లాడుతూ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, ఆయన సోదరుడు గుమ్మనూరు నారాయణ గుత్తి మండలంలో సొంత నిధులు వెచ్చించి అనేక అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. ఇది చూసి ఓర్వలేక రాజకీయ కుట్ర జరుగుతోందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కారానికి చర్యలు చేపట్టిన గుమ్మనూరు సోదరులపై అవాస్తవాలు ప్రచురించడం తగదన్నారు. అలాగే బసినేపల్లికి చెందిన వైసిపి నాయకుడు షేక్షావలి మాట్లాడుతూ గుమ్మనూరు నారాయణ తనను కిడ్నాప్ చేసి దాడి చేయడం అనేది అవస్థమన్నారు. తన గ్రామ అభివృద్ధికి గుమ్మనూరు నారాయణ తోడ్పాటును అందిస్తామని చెప్పారే తప్ప ఎలాంటి ఘటన జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బర్దివలి, నాయకులు దిల్కాశీనా, కోనంకి కృష్ణ, సొలమన్‌రాజా, లక్ష్మణ్ చౌదరి, శ్రీనివాస చౌదరి, వెంకటరాముడు, ఎ.నరసింహులు, డి.లక్ష్మీదేవి, సర్పంచులు పి.భరత్‌కుమార్, యు.రామలింగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఐఎబి ప్రాధాన్యత తగ్గుతోందా.?




ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎప్పుడైనా సీజన్ ప్రారంభానికి ముందే నీటి పంపకాలపై ప్రణాళికలు రూపొందించుకుంటారు. అందుకు అనుగుణంగా ఏడాది ప్రణాళిక ఉంటుంది. అయితే ఉమ్మడి అనంతపురం జిల్లాలో మాత్రం ఎలాంటి ప్రణాళికలు లేకుండానే ముందుకు సాగుతుండటం గమనార్హం. ఇప్పటికే ఖరీఫ్ సీజన్ ముగిసే సమయం వచ్చింది. కానీ ఇప్పటి వరకు సాగునీటి సలహా మండలి సమావేశం జరగలేదు. దీంతో దిగువనున్న ఆయకట్టు రైతుల్లో అయోమయం నెలకొంది. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ కింద ఎగువ ప్రధాన కాలువ, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్‌కు నీటిని విడుదల చేశారు. దిగువనున్న మిడ్‌పెన్నార్, ఉత్తర కాలువ, పిఎబిఆర్ కుడికాలువకు నీటిని విడుదల చేయలేదు. ఇది విడుదల చేయాలంటే సాగునీటి సలహా మండలి సమావేశంలో నిర్ణయం జరగాల్సి ఉంది. ఎగువనున్న కెనాల్స్‌కు సలహా మండలి సమావేశం నిర్ణయం జరగకుండానే నీటిని విడుదల చేస్తున్నారు. కాని దిగువనున్న కెనాల్స్‌కు నీటిని విడుదల తేదీలు ఖరారు కాకపోవడంతో ఈ ప్రాంత రైతుల్లో అయోమయం నెలకొంది. ఈ వారంలో ఐఎబి సమావేశం తేదీలు ఖరారు చేసి చివరి నిమిషంలో వాయిదా వేశారు. దీనిపై విపక్షాలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నాయి. వర్షాలొచ్చి పుష్కలంగా నీరున్నా ఐఎబి సమావేశం నిర్వహించకుండా వాయిదాలు వేయడాన్ని తప్పుబడుతున్నారు. త్వరలోనే ఖరారు చేసి నీటి విడుదల చేయకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు మరో తేదీని ఖరారు చేశారు. ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఈతేదీలోనైనా జరుగుతుందా.. లేదా.. అన్నది చూడాల్సి ఉంది. గతంలో ఎన్నడూలేనంతగా ఈసారి తుంగభద్ర డ్యామ్‌కు, శ్రీశైలంకు నీరొచ్చాయి. దీంతో హెచ్ఎల్‌సి, హెచ్ఎన్ఎస్-ఎస్‌కి నీరు పుష్కలంగా వస్తుందని ఆశించారు. కానీ నీటి నిర్వహణలో లోపాలు చోటు చేసుకున్నాయి. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితి అధ్వాన్నంగా ఉండటంతో పూర్తి సామర్థ్యంతో నీటిని తీసుకోలేకపోతున్నారు. దీని ఆధునీకరణ సైతం అటకెక్కింది. ఈ వారంలోనూ కాలువపై బ్రిడ్జి పడిపోయింది. ఈ రకంగా వరుసగా ప్రతి ఏటా ఏదోక చోట బ్రిడ్జి పడిపోతూనే ఉన్నాయి. దీనికి తక్షణ మరమ్మత్తులకు రూ.30 కోట్లు అయినా ఖర్చు అవుతుందని అంచనా వేశారు. అయితే ప్రభుత్వాలు మారుతున్నా నిర్వహణపై మాత్రం దృష్టి సారించడం లేదు. కనీస మరమ్మతులకు కూడా నోచడం లేదు. ఎప్పుడు ఎక్కడ విపత్తు సంభవిస్తుందో తెలియడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ఆధునీకరణ పనులు చేపట్టాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇక ఈవారంలో జరిగిన ప్రదానమైన అంశాల్లో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు అనంతపురంలో అట్టహాసంగా జరుగుతున్నాయి. అట్టహాసంగా జరుగుతున్న ఈ మహాసభలకు రాష్ట్రం నలుమూలల నుంచి జన విజ్ఞాన వేదిక నాయకులు తరలొచ్చాయి.

వైసిపి కార్యకర్తలపై దాడి

బాధితులను పరామర్శించిన జిల్లా అధ్యక్షులు అనంత


బాధితులను పరామర్శిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-కుందుర్పి

మండలంలోని తూమకుంట గ్రామానికి చెందిన వైసిపి నాయకులు జగదీష్, భార్య రోజాపై శుక్రవారం రాత్రి టిడిపి నాయకుడు నాగభూషణ గోడ్డలతో దాడి చేశాడు. ఏఎస్ఐ, గ్రామస్తుల కథనం మేరకు.. టిడిపి బూత్ కన్వీనర్ నాగభూషణం ఇంటి ముందు పైపులైన్ చేయకుండా అడ్డుకునే కుట్రలో భాగంగా వైసిపికి చెందిన జగదీష్, భార్య రోజాపై నాగభూషణం గొడ్డలితో నరికాడు. వెంటనే స్థానికులు 108 ద్వారా కళ్యాణదుర్గానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య చికిత్స కోసం అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పెద్దాసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కమల నాగరాజు, మార్కెట్ డైరెక్టర్ జి.లింగప్ప, ఎనములదొడ్డి సర్పంచి విజయ్‌కుమార్, తెనగల్లు సర్పంచి వరలక్ష్మి, వెంకటేశులు, జంబుగుంపల సర్పంచి గంగాధర్, మాజీ జడ్పీటిసి రాజగోపాల్, మాజీ సర్పంచి తిప్పేస్వామి, తూముకుంట అనుమప్ప, తదితరులు పాల్గొన్నారు.